పెళ్లి డబ్బులైనా ఆధారాలు చూపాల్సిందే

50 వేలకు మించి నగదు ఉంటే పత్రాలుండాల్సిందే

- వేసవి అయినా పోలింగ్ సమయం పెంచే చాన్స్ లేదు
- 190 రకాల ఎన్నికల మెటీరియల్ పంపిణీ షురూ
- 27 రకాల సాఫ్ట్‌వేర్, యాప్‌లను వినియోగిస్తున్నాం
- అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు వేల చోట్ల తక్కువ పోలింగ్
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లే ప్రతి ఒక్కరూ ఆధారాలు, పత్రాలను చూపించాల్సిందేనని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) వికాస్‌రాజ్ స్పష్టంచేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నదని చెప్పారు. వేసవిలో పెళ్లిళ్లు ఉన్నాయని, పెళ్లి కొనుగోళ్లు జరిపేవాళ్లు నగదుకు సంబంధించిన ఆధారాలు, పత్రాలను వెంట తీసుకెళ్లాలని సూచించారు. పెళ్లిళ్లకు ప్రత్యేకంగా ఎన్నికల కోడ్‌ను సడలించే అవకాశం లేదని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం 'నమస్తే తెలంగాణ'కు వికాస్‌రాజ్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

పెండ్లి బట్టలు, బంగారం కొనుగోళ్లకు డబ్బులు ఎలా తీసుకెళ్లాలి?

ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదుతో వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరూ తగిన ఆధారాలను, పత్రాలను వెంట తీసుకెళ్లడం మంచిది. ఎన్నికలకు సంబంధంలేని డబ్బులు అయితే జిల్లా స్థాయిలోని గ్రీవెన్స్ సెల్స్ యాక్టివేట్ అయ్యాయి. ఆ కమిటీల దగ్గర ఆధారాలు చూపితే ఆ డబ్బులను తిరిగి ఇస్తారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లు, దుస్తులు, బంగారం కొనుగోళ్లు వంటి డబ్బులకు ఆధారాలను తీసుకెళ్లాలి. కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు కోడ్ ఉంటుంది. కోడ్ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిందే. వేసవి దృష్ట్యా పోలింగ్ సమయాన్ని పొడిగించే అవకాశం లేదు. గతంలో ఎన్నడూ పోలింగ్ సమయాన్ని పెంచలేదు. ఈ సారి కూడా పెంచం.

ఎన్ని రకాల మెటీరియల్స్ అవసరం?

ఎన్నికల నిర్వహణకు 190 రకాల మెటీరియల్స్ అవసరం ఉంటుంది. అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి కేంద్ర ఎన్నికల సంఘం 27 రకాల సాఫ్ట్‌వేర్లను రూపొందించింది. వీటన్నంటిని ఉపయోగించి ఎన్నికల నిర్వహణ మరింత పారదర్శకంగా, జవాబుదారీ తనంతో ఉండే విధంగా చేస్తున్నాం. కేవీసీ, ఓటర్ టర్న్ అవుట్, ఎక్స్‌పెండిచర్ యాప్, సువిధ పోర్టల్ ఇలా అనేక రకాలుగా ఐటీని వినియోగిస్తున్నాం.

పోలింగ్ సిబ్బంది గుర్తింపు ప్రక్రియ ఎంత వరకు వచ్చింది?

ఎన్నికల ఏర్పాట్లలో పోలింగ్ సిబ్బంది గుర్తింపు ప్రధాన ప్రక్రియ. రాష్ట్రంలో ఇప్పటికే ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇతర సిబ్బందిని గుర్తించాం. వీరు 1.85 లక్షల మంది అవసరమవుతారని అంచనా వేశాం. వారందరనీ గుర్తించాం. వీరికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియ దగ్గరికి వచ్చాక వీరికి శిక్షణ ఇస్తాం. వీరికి శిక్షణ ఇచ్చే సమయంలో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఫారం ఇస్తాం. వారు ఎక్కడ ఓటు వేస్తారో అందులో ఆప్షన్ ఇస్తాం. వారికి ఓటు ఉన్న నియోజకవర్గంలో ఓటు వేస్తారా లేక పనిచేసే దగ్గర ఓటు వేస్తారా అనేది వారికి ఆప్షన్‌గా ఇస్తాం. దీని కోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను కేంద్ర ఎన్నికల సంఘం తయారు చేసింది. గతంలో వారికి ఓటు ఉన్న నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్ దగ్గర మాత్రమే ఓటు వేసే అవకాశం ఉండేది కానీ ఇప్పుడు రెండు ఆప్షన్లు ఇస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో లాగా కాకుండా ఉద్యోగులకు కొంత వెసులుబాటు ఉండేలా నిర్ణయం తీసుకున్నాం.

ఈవీఎంలు రెడీగా ఉన్నాయా.. చెక్ చేశారా?

ఈవీఎంలు రెడీ చేశాం. ఇప్పటికే తొలిదశ చెకింగ్ (ఎఫ్ఎల్సీ) పూర్తి చేశాం. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశిస్తే రెండోదశ చెకింగ్ చేస్తాం. రెండో దశలో జిల్లా కేంద్రం నుంచి నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంలు వెళ్తాయి. వీటన్నంటి కోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను ఈసీ తయారు చేసింది. ఏ ఈవీఎం ఎక్కడికి వెళ్లింది అనేది ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా తెలుస్తుంది. 25 నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కోర్టు కేసులు ఉండటంతో ఆ నియోజకవర్గాల్లోని ఈవీఎంలను వినియోగించడంలేదు. దీంతో అదనపు ఈవీఎంలను తెప్పించాం. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు అవసరమైనన్ని ఉన్నాయి. ఈ సారి జిల్లా కేంద్రంలోనే పోస్టల్ బ్యాలెట్లను ప్రింట్ చేసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు సూచించాం. వారికే అధికారం ఇచ్చాం. దీని ద్వారా త్వరగా పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ అవుతుంది. కౌంటింగ్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను గుర్తించాం.

ఎంత మందితో బందోబస్తు ఉంటుంది?

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి రాష్ట్రానికి ఇప్పటికే 40 కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయి. మరో 100కు పైగా కేంద్ర బలగాలు రాష్ట్రానికి వస్తాయి. వీరితోపాటు కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశాల నుంచి రాష్ట్రానికి పోలీసులు వస్తారు. రాష్ట్రంలో ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంతంగా, ఒక్క పోలింగ్ కేంద్రంలో కూడా రిపోలింగ్ లేకుండా నిర్వహించాం. అదే విధంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

ఓటర్ల సంఖ్య ఏమైనా పెరిగిందా?

రాష్ట్రంలో 2018 ఎన్నికల్లో 2.05 కోట్ల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటే 2023 నాటి కల్లా 2.32 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 2018 కంటే 13 శాతం అధికం. ఓటింగ్ శాతం తక్కువగా అయినట్లుగా కనిపిస్తున్నా... ఓటర్ల సంఖ్య పరంగా పరిశీలిస్తే 13 శాతం అధికం. రాష్ట్రంలో అతి తక్కువ పోలింగ్ అయిన పోలింగ్ కేంద్రాలు ఐదు వేలు ఉన్నాయి. అక్కడ ఎందుకు పోలింగ్ తక్కువ జరిగిందో పరిశీలించాం. ఎండాకాలం నేపథ్యంలో మంచినీరు, కుర్చీలు, అవసరమైతే టెంట్లు వేస్తాం. దివ్యాంగులకు వీల్ చైర్‌లు, మూత్రశాలలు అందుబాటులో ఉంచుతాం.

రాష్ట్రంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి?

మహబూబ్‌నగర్ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేశాం. 1,400 మందికిపైగా ఓటర్లు ఉన్నారు. వీరికి 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లను చేశాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ ఏర్పాట్లు చేశాం. మరో వైపు కంటోన్మెంట్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేశాం. లోక్‌సభతోపాటు ఎన్నికలు నిర్వహిస్తాం. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

85 ఏండ్ల వృద్ధులు హోం ఓటింగ్ కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

దివ్యాంగులు, 85 ఏండ్ల వయస్సు దాటిని వారికి హోం ఓటింగ్ సౌకర్యాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. వీరు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నాక.. రెండు రోజుల తరువాత బ్యాలెట్ పేపర్ ముద్రించాక ఓటింగ్ ప్రారంభిస్తాం. ఎన్నికల తేదీకి ఐదు రోజుల ముందుగా పూర్తిచేస్తాం. అత్యవసర సేవలు అందించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాం. వీరు 12 డీ ఫాం ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న వాళ్లు ఆ విధానంలోనే ఓటు వేయాల్సి ఉంటుంది. మళ్లీ సాధారణ పద్ధతిలో ఓటు వేస్తామంటే అనుమతించం.

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ Special Interview

ఓటు కోసం ఎప్పటివరకు దరఖాస్తు చేసుకోవచ్చు?

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తరువాత 12.53 లక్షల కొత్త ఓటర్లు చేరారు. 7.80 లక్షల ఓటర్ల తమ వివరాల్లో మార్పులు చేసుకున్నారు. ఇలా 20.33 లక్షల ఓటర్లకు కొత్త కార్డులు ముద్రించి ఇస్తాం. ఇందులో ఇప్పటికే 10 లక్షల కార్డులు ముద్రించాం. 8 లక్షల కార్డుల ముద్రణకు ఆర్డర్ ఇచ్చాం. మరో 2 లక్షల కార్డుల ముద్రణకు ఆర్డర్ ఇవ్వాల్సి ఉన్నది. ఇంకా ఒక లక్ష కొత్త దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నాం. వీరందరికీ ఓటింగ్ నాటి కల్లా కొత్త ఓటరు కార్డులను ముద్రించి పంపిణీ చేస్తాం. ఓటు హక్కు లేని వారు కొత్త ఓటు హక్కు కోసం ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి అయిన వారు ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరిలో అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తాం.

కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో తనిఖీలు చేపడుతున్నారా?

ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా తనిఖీలు చేపట్టాం. రాజకీయ కార్యకలాపాలు పెరిగితే తనిఖీలను పెంచుతాం. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు తనిఖీలు చేస్తాయి. చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. వాటిలో సీసీ కెమెరాలను పెట్టాం. వీటన్నంటిని పర్యవేక్షించడానికి కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నాం. రాజకీయ పార్టీలు ఇచ్చే ప్రకటనలకు తప్పనిసరిగా ఎంసీఎంసీ ఆమోదం తీసుకోవాల్సిందే. ఈ-పేపర్, డిజిటల్ మీడియాలో ప్రచురించే, ప్రచారం, ప్రసారం చేసే వాటికైనా అనుమతి తీసుకోవాల్సిందే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నమోదు అయినా ఎంసీఎంసీ కేసులు కొనసాగుతున్నాయి. వాటిపై విచారణ కొనసాగుతున్నాయి.

ఎన్నికల్లో అక్రమాలు జరిగితే ఎవరికి ఎలా ఫిర్యాదు చేయాలి?

ఎన్నికల్లో జరిగే అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై 1950, సీ విజిల్ యాప్‌ల ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వారి ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తాం. ప్రజలు బాధ్యతగా అక్రమాలు, మద్యం, డబ్బు పంపిణీపై ఫిర్యాదు చేయవచ్చు. అనుమతి లేకుండా మీటింగ్‌లు, ర్యాలీలు చేసినా ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికలకు పరిశీలకులు నామినేషన్ల చివరి రోజున రాష్ట్రానికి వస్తారు. ఎంత మందిని నియమించారనేది త్వరలో సమాచారమిస్తారు.

అడవులను కాపాడిన దార్శనికుడు కేసీఆర్

- రాష్ట్రంలో 8% గ్రీన్ కవర్ పెంచారు
- నాడు ప్రతిపల్లె పచ్చదనంతో మురిసె
- ప్రతి పట్టణంలోనూ హరితశోభ
- ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కేటీఆర్ ట్వీట్



హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): దశాబ్దాలపాటు ధ్వంసమైన అడవులను కంటికి రెప్పలా కాపాడిన దార్శనికుడు కేసీఆర్ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో ఆగమైన అటవీ సంపద చుట్టూ అందమైన పచ్చని పందిరి అల్లిన ప్రకృతి ప్రేమికుడు కేసీఆర్ అని ప్రశంసించారు. తెలంగాణలో మహోద్యమంలా సాగిన ఆనాటి హరితహారం, 230 కోట్ల మొక్కలు నాటాలన్న సంకల్పం ప్రపంచ చరిత్రలోనే మూడో అతిపెద్ద మానవ ప్రయత్నయని పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేటీఆర్ గురువారం ట్విట్టర్ (ఎక్స్)లో పచ్చదనాన్ని వృద్ధి చేయడంలో గత కేసీఆర్ సర్కారు సాధించిన విజయాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పదేండ్ల పాలన.. పుడమి తల్లికి ఆభరణం

'సుమారు 15 వేల నర్సరీల పెంపకం ఈ మహాయజ్ఞంలో సరికొత్త అధ్యాయం. 8 శాతం పెరిగిన గ్రీన్ కవర్ దేశ చరిత్రలోనే నెవర్ బిఫోర్. తెలంగాణ పునర్నిర్మాణం అంటే ప్రజల బతుకు చిత్రాన్ని మార్చడమే కాదు...చిక్కిశల్యమైన అడవులను సకల జీవరాశులను సంరక్షించమని నలుదిశలా చాటి చెప్పిన నాయకత్వం మనది. అందుకే బీఆర్ఎస్ పదేండ్ల ప్రస్థానం.. పుడమి తల్లికి వెలకట్టలేని ఆభరణం. నాడు ప్రతి పల్లె పచ్చదనంతో మురిసింది... ప్రతి పట్టణం హరిత శోభతో వెల్లివిరిసింది. నేడు గ్లోబల్ వార్మింగ్‌తో మానవాళికి వార్నింగ్‌లు... ఎటుచూసినా క్లౌడ్‌బరస్టులు, కుండపోతల ప్రమాద ఘంటికలు. ఈ ప్రకృతి విపత్తులను అరికట్టాలన్నా.. పర్యావరణ సమతుల్యత సాధించాలన్నా.. ఆపదలో ఉన్న అటవీ సంపదను కాపాడాలన్నా.. మానవజాతి చేతిలో ఉన్న ఏకైక బ్రహ్మాస్త్రం హరితహారం. నాడు.. నేడు.. ఏనాడైనా.. బీఆర్ఎస్ నమ్మే సిద్ధాంతమిది. అందుకే... జంగిల్ బచావో.. జంగిల్ బడావో... నినాదాన్ని అక్షరాలా నిజం చేశారు నాటి సీఎం కేసీఆర్. భవిష్యత్తు తరలాలకు మనమిచ్చే వారసత్వ సంపద కాంక్రీట్ జంగిళ్లు కానే కాదని.. పచ్చని అటవీ సంపద అని చాటి చెప్పి.. గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను తలదన్నేలా నిర్మించిన గ్రీన్ వాల్ ఆఫ్ తెలంగాణ సాక్షిగా..ప్రకృతి ప్రేమికులందరికీ... ప్రపంచ అటవీ దినోత్సవ శుభాకాంక్షలు. జై హరిత హారం.. జై తెలంగాణ.. జై బీఆర్ఎస్' అని కేటీఆర్ పేర్కొన్నారు.

చెక్కుల క్లియరెన్స్‌కు చుక్కలు చూడాల్సిందే

- ఆర్థిక శాఖలో కుప్పలుగా విజ్ఞప్తులు
- రోజూ వెయ్యికిపైగా దరఖాస్తులు
- బిల్లుల కోసం ప్రదక్షిణలు
- చేతులెత్తేస్తున్న అధికారులు
- మెడికల్, జీపీఎఫ్, రుణాలు, అడ్వాన్స్‌లు..అన్నీ పెండింగే

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): సచివాలయంలోని ఆర్థిక శాఖ కార్యాలయం నిత్యం కిటకిటలాడుతున్నది. ఖజానాలో కాసుల గలగల అనుకుంటే పొరపాటే. బిల్లుల మంజూరు కోసం రోజూ వెయ్యి మందికిపైగా బారులు తీరుతున్నారు. కొందరికి మెడికల్ బిల్లులు.. మరికొందరికి జీపీఎఫ్ బిల్లులు... ఇంకొందరికి ఇన్సూరెన్స్ మొత్తం, జీతం అడ్వాన్స్‌లతోపాటు కాంట్రాక్టులకు చెల్లించాల్సిన బిల్లులు.. ఇలా రాష్ట్ర ఆర్థిక శాఖలో కుప్పలు తెప్పలుగా విజ్ఞప్తులు పేరుకుపోతున్నాయి. చెక్కుల క్లియరెన్స్ కోసం సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పట్టపగలే చుక్కలు చూస్తున్నారు. అధికారులు రోజూ ఒకటి అర తప్ప ఎలాంటి బిల్లులు చెల్లించడం లేదని తెలుస్తున్నది. క్లియర్ అయ్యే బిల్లులు కూడా ఎంతో పెద్ద పైరవీ చేస్తే తప్ప రావడం లేదని సమాచారం. దీంతో బాధితులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వీరందరికీ బిల్లులు ఆయా శాఖ పరిధిలో మంజూరై టోకెన్లతోపాటు చెక్కులు కూడా సిద్ధం చేశారు. కానీ ఖాతాలో డబ్బులు మాత్రం జమకావడం లేదు. బాధితుల్లో మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్‌కు చెందిన వారే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు తెలిసింది. దీనిని బట్టి చూస్తే పెండింగ్ బిల్లులలో లక్ష లోపు వాటిని కూడా ఆర్థిక శాఖ విడుదల చేయడం లేదని తెలుస్తుంది. వీరిలో సామాన్యులతో పాటు ఉద్యోగులు కూడా ఉన్నారు. ఇందులో అధిక సంఖ్యలో పదవీ విరమణ చెందిన వారు ఉండడం గమనార్హం. ఇలా పేరుకుపోతున్న పెండింగ్ బిల్లులు చెల్లించడానికి ప్రక్రియ మొదలు పెట్టినట్లు ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. బాధితుల నుంచి వినతి పత్రాలతో పాటు బిల్లుల చెల్లింపునకు టోకెన్లు కూడా స్వీకరిస్తున్నారు. ఈ నెలాఖరులోగా బ్యాంకు ఖాతాల్లో బిల్లులకు సంబంధించిన డబ్బులు జమ అవుతాయని చెప్తున్నారు. నిధులు రాకను బట్టి పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని, మొత్తం క్లియర్ కావాలంటే కొంత సమయం పడుతుందని ఆర్థిక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. బాధితులు ఓపిక పట్టాల్సిన అవసరం కూడా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి దృష్టి పెట్టి సకాలంలో పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని బాధితులు కోరుతున్నారు.

క్యూఆర్ కోడ్‌తో రైల్వే టికెట్ జారీ

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : రైల్వే టికెట్ జారీలో క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్ సౌకర్యాన్ని గురువారం నుంచి దక్షిణ మధ్య రైల్వే జోన్ అందుబాటులోకి తెచ్చింది. దీనివల్ల టికెట్ కొనుగోలు చేసే క్రమంలో.. తలెత్తే చిల్లర సమస్యలను సంపూర్ణంగా అధిగమించవచ్చని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 14 రైల్వే స్టేషన్లలో 31 కౌంటర్లను ఎంపిక చేసినట్టు వెల్లడించారు. ఫోన్‌పే, గూగుల్‌పే, భీమ్, పేటీఎం వంటి వాలెట్ ద్వారా టికెట్ బుకింగ్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి టికెట్ పొందే సౌకర్యాన్ని కల్పించినట్టు పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం టికెట్ ధరల పట్టికను స్టేషన్లలో ప్రదర్శించాలని అధికారులు నిర్ణయించారు.

గవర్నర్‌కు డిప్యూటీ సీఎం భట్టి శుభాకాంక్షలు

ప్రమాణస్వీకారం రోజు రాలేకపోయానని వివరణ

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం జరిగిన రోజు అందుబాటులో లేకపోవడం వల్ల రాలేకపోయినట్టు గవర్నర్‌కు ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్‌గా రాధాకృష్ణన్ బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. దీనికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సహచర మంత్రులు కూడా హాజరైనప్పటికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాలేకపోవడం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఢిల్లీలో మంగళవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశానికి వెళ్లిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అక్కడే ఉండిపోవడంతో గవర్నర్ ప్రమాణ స్వీకారానికి రాలేకపోయినట్టు ఆయన సన్నిహితుల సమాచారం. ఇదే విషయాన్ని గవర్నర్‌ను కలిసిన సందర్భంగా భట్టి విక్రమార్క గుర్తు చేసినట్టు తెలిసింది. కాగా, డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు కూడా గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రంలో మెరుగుపడిన వాయు నాణ్యత

గాలిలో తగ్గిన దుమ్ము, ధూళి కణాల సంఖ్య

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : దేశంలోని ప్రధాన నగరాలతో పోలిస్తే హైదరాబాద్, పటాన్‌చెరు, నల్లగొండ, సంగారెడ్డి పట్టణాలలో వాయు నాణ్యత మెరుగుపడిందని వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2023 వెల్లడించింది. వరుసగా ఐదు సంవత్సరాలలో నమోదైన వాయు నాణ్యత ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. 2019 నుంచి 2023 మధ్య హైదరాబాద్‌లో గాలి నాణ్యత మెరుగుపడినట్టు ఆ నివేదిక పేర్కొంది. గాలిలోని దుమ్ము, ధూళి కణాల (పీఎం10 –మైక్రాన్‌లు) సాంద్రత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపడినట్టు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం భారత్ వాయుకాలుష్య దేశాల్లో 3వ స్థానంలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తీసుకున్న చర్యలతో గడిచిన ఐదేండ్లలో హైదరాబాద్, పటాన్‌చెరు, నల్లగొండ, సంగారెడ్డిలో గాలి నాణ్యత మెరుగుపడినట్టు ఆ నివేదిక తెలిపింది. కాలుష్య నియంత్రణకు బ్లాక్–టాపింగ్, పాట్‌హోల్స్ లేని రోడ్ల నిర్వహణ, గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి, చెత్త రీసైక్లింగ్, అనధికార డంపింగ్ పర్యవేక్షణ, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై జరిమానాల విధింపు వంటి చర్యలు చేపట్టింది.

గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్. చిత్రంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు దినేశ్‌కుమార్, జగన్‌మోహన్‌రావు, సతీశ్‌రెడ్డి

నా ఫోన్ ఎందుకు సీజ్ చేశారు?

- వారెంట్ లేకుండా సీజ్ ఏమిటి?
- ఎన్ని కేసులు పెట్టినా భయపడం
- సోషల్ మీడియా పోస్టుకు కట్టుబడ్డా
- కాంగ్రెస్ అభ్యర్థి కూడా చిత్రపురి సొసైటీ అవినీతిపై ఆరోపణలు చేశారు
- ప్రభుత్వం విచారణ జరిపించాలి
- బీఆర్ఎస్ నేత క్రిశాంక్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): వారెంట్ ఉంటేనే ఫోన్ సీజ్ చేయాల్సి ఉంటుందని, కానీ ఎలాంటి వారెంట్ లేకుండానే తన ఫోన్ ఎందుకు సీజ్ చేశారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ నిలదీశారు. ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడబోనని స్పష్టం చేశారు. చిత్రపురి సొసైటీ అవినీతిపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు దినేశ్‌కుమార్, జగన్‌మోహన్‌రావు, సతీశ్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ ఫిర్యాదుతో తనపై మాదాపూర్ పోలీసులు కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బుధవారం రాత్రి ఏడు గంటలకు పోలీసులకు తనకు చెప్పారని, లాయర్‌తో కలిసి ఠాణాకు వెళ్తే కేసు వివరాలు అందించారని తెలిపారు. కానీ, వారెంట్ లేకుండానే తన ఫోన్‌ను కూడా సీజ్ చేశారని, ఫోన్ పాస్‌పోర్ట్ కూడా తీసుకున్నారని వాపోయారు.

వారు చెప్పిందే పోస్టు చేశా

చిత్రపురి కాలనీలో రూ.3 వేల కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్ ఆరోపణలు చేశారని, ప్రముఖ యూట్యూబర్ కూడా అవినీతి జరిగిందని చెప్పారని, తాను అదే విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశానని క్రిశాంక్ చెప్పారు. చిత్రపురి సొసైటీ కోశాధికారి అనుముల మహానందరెడ్డి ఎవరో తెలియదని సీఎం అంటున్నారని, మహానందరెడ్డితో సీఎం దిగిన ఫొటోలను ఈ సందర్భంగా మీడియాకు చూపించారు. తన ఫోన్‌లో అనేక రకాల సమాచారం ఉన్నదని, ప్రభుత్వం చేస్తున్న కుంభకోణాలకు సంబంధించి పరిశోధన సమాచారం అందులో ఉన్నదని తెలిపారు. తనపై పెట్టిన కేసుపై న్యాయ పోరాటం చేస్తానని, చట్ట ప్రకారం ఫోన్లను జప్తు చేసే అధికారం లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని గుర్తుచేశారు. జ్యుడీషియల్ వారెంట్ ఉంటేనే ఫోన్లు జప్తు చేయాలని, కానీ తనకు ఎలాంటి వారెంట్ ఇవ్వలేదని మండిపడ్డారు.

నాడు రేవంత్‌రెడ్డి ఫోన్ తీసుకోలేదు..

చిత్రపురిలో జరిగిన రూ.3 వేల కోట్ల కుంభకోణంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు విచారణ చేయడం లేదని క్రిశాంక్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కేసీఆర్ కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయలేదా? గతంలో ఏనాడూ కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ఫోన్‌ను తీసుకోలేదని పేర్కొన్నారు. తాము కూడా అలా చేస్తే రేవంత్‌రెడ్డి రాజకీయాలు చేసేవారా? అంటూ నిలదీశారు. ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ పాలన అని గుర్తుకు తెస్తుందని మండిపడ్డారు. గ్రామస్థాయిలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నేతలు దాడులు చేస్తున్నారని, తమ ఫోన్లతోపాటు పీఏ, పీఆర్వోల ఫోన్లను సైతం తీసుకుంటున్నారని విమర్శించారు. తన ఫోన్‌ను మాదాపూర్ పోలీసులు కోర్టుకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. తన ఫోన్ పోలీసుల దగ్గర ఉన్నదా? లేక రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్నదా? అనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. డాటా గోప్యతపై కోర్టు గతంలో అనేక తీర్పులు ఇచ్చిందని, వాటి ఆధారంగా రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై ఉన్నత న్యాయ స్థానంలోనే తేల్చుకుంటామని చెప్పారు. ధర్మపురి నియోజకవర్గంలోనూ ఇదే తరహాలో బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడిపై దాడుల చేశారని గుర్తుచేశారు. పోలీసులు కూడా నియమ, నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని గుర్తించుకోవాలని హితవుపలికారు.

ప్రజల తరఫున పోరాడుతాం

సోషల్ మీడియాలో అధికార పక్షం గురించి ఒక్క పోస్టు పెట్టినా కేసులు పెడుతున్నారని సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి ఆరోపించారు. కేసుల కంటే ముందు 100 రోజుల్లో 13 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు ఎందుకు అమలు చేస్తలేరని ప్రశ్నిస్తే, ప్రజ ల తరఫున పోరాడితే ఫోన్ సీజ్ చేస్తారా? కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడమని, పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టులపై కూడా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇదేనా స్వేచ్ఛా అంటూ ప్రశ్నించారు. ప్రజల తరఫున పోరాడుతామని స్పష్టంచేశారు.

రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే ఇంటికొచ్చి కొడుతా!

ప్రెస్‌మీట్ పెట్టి బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌కు వార్నింగ్ • సోషల్ మీడియాలో వైరలైన కాంగ్రెస్ నేత ధమ్కీ



హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మన్నె క్రిశాంక్‌ను ఇంటికొచ్చి కొడుతా.. అంటూ కాంగ్రెస్ నాయకుడు ప్రెస్‌మీట్ పెట్టి మరీ వార్నింగ్ ఇవ్వడం రాజకీయవర్గాల్లో కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే పార్టీ కండువా పక్కన పడేసి ఇంటికి వచ్చి కొడుతా.. అని గాంధీభవన్‌లో గురువారం ప్రెస్‌మీట్ పెట్టి మెట్టు సాయికుమార్ హెచ్చరించారు. ఒక పార్టీకి చెందిన వ్యక్తిని మరో పార్టీకి చెందిన నాయకుడు ఈ విధంగా హెచ్చరించడం మునుపెన్నడూ లేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న తరుణంలో ప్రెస్‌మీట్ మరీ ఇంటికి వచ్చి కొడుతానని వార్నింగ్ ఇవ్వడం పట్ల పోలీసులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి. కాగా, సీఎం రేవంత్‌రెడ్డిపై సామాజిక మధ్యమాల్లో పోస్టు పెట్టారన్న నెపంతో మన్నె క్రిశాంక్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. పోస్టు పెట్టినందుకే కేసు పెట్టిన పోలీసులు.. ప్రతిపక్ష పార్టీ నేతను ఇంటికొచ్చి మరీ కొడుతా అంటూ బహిరంగంగా ధమ్కీ ఇచ్చిన నాయకుడిపై ఏం చర్య తీసుకుంటారో చూడాలి.

రాత్రివేళ.. బస్సు నుంచి దింపేసిన కండక్టర్

ఓవర్‌లోడ్ పేరిట దారి మధ్యలో వదిలేసిన వైనం • ఇబ్బందులుపడ్డ పది మంది మహిళలు



కండక్టర్ బస్సు దింపేయడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

జగిత్యాల, మార్చి 21 : రాత్రి వేళ బస్సెక్కిన ఓ పదిమంది మహిళలను ఆర్టీసీ కండక్టర్ ఓవర్ లోడ్ పేరిట నిర్దాక్షిణ్యంగా దారి మధ్యలో వదిలి వెళ్లాడు. ఈ ఘటన గురువారం రాత్రి జగిత్యాలలో చోటుచేసుకున్నది. జగిత్యాల నుంచి ధర్మారం వెళ్లే ఆర్టీసీ బస్సు రాత్రి 8 గంటలకు జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి బయలుదేరింది. బస్సు ఓవర్ లోడ్ అయిందని, టికెట్లు ఇచ్చే మెషీన్‌లో చార్జింగ్ లేదని, మెషీన్ నుంచి టికెట్లు రావడం లేదన్న సాకుతూ రూరల్ మండలంలోని తిమ్మాపూర్ శివారులో గల నల్లగుట్ట వద్ద పదిమంది మహిళలను కండక్టర్ దింపేశాడు. దీంతో మహిళా ప్రయాణికులు ముందుకు, వెనక్కి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో తిమ్మాపూర్ క్రాస్ రోడ్డులోని గ్రామస్థులు ధర్మారం వైపు వెళ్తున్న చివరి బస్సును ఆపి వారిని ఎక్కించారు. ఆ బస్సులోనూ ఓవర్‌లోడ్ ఉన్నదని కండక్టర్ చెప్పగా, గ్రామస్థులు బతిమిలాడి బస్సు ఎక్కించి మహిళలను గమ్య స్థానాలకు దించాలని వేడుకున్నారు. ఈ విషయమై డీఎం సునీతను సంప్రదించగా స్పందించలేదు.

ఎకరానికి 15000

మొదటిపేజీ తరువాయి...

జమ చేశామని వివరించారు. మిగతా రైతులకు రానున్న రోజుల్లో నగదు బదిలీ చేస్తామని వెల్లడించారు. రైతులు సాగుచేసే పంటలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించే ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ ఒకేదఫాలో పూర్తి చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. ఆయన వెంట నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఉన్నారు.